క్లుప్తంగా

ఈవీఎంల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి

కాజులూరు: ఈవీఎంలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల తహసీల్దార్ శాంతిలక్ష్మి అన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం కాజులూరులో పలువురు మండల స్థాయి అధికారులకు, ఎన్నికల బూత్‌లెవల్ అధికారులు, పాఠశాల మహిళా ఉపాధ్యాయులకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో గతంలో ఉండే బ్యాలెట్ ఓటింగ్ స్థానంలో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఈవీఎంలను వినియోగిస్తున్నారని సిబ్బంది వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ద్వారా పోలింగ్ సమయంలో ఓటర్లకు తలెత్తే అనుమానాలను నివృత్తి చేయగలరన్నారు. ఎంపీడీవో ఐ.రత్నంరాజు, ఆర్‌ఐ వేగేశ్వరరావు, వీఆర్వోలు దుర్గారావు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం పల్స్ పోలియో విజయవంతం

కాజులూరు: మండల గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నూరుశాతం విజయవంతంగా పూర్తి చేసినట్టు గొల్లపాలెంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య, దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ తెలిపారు. బుధవారం వేర్వేరు ప్రకటనల్లో వారు మాట్లాడుతూ గొల్లపాలెంలో పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 2357 మంది ఐదేళ్ల లోపు వయస్సు కలిగిన చిన్నారులు, దుగ్గుదుర్రు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 2284 మంది చిన్నారులు ఉండగా తొలిరోజు ఆదివారం శిబిరాల ద్వారా పోలియో చుక్కలు వేసి 94 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. సోమ, మంగళవారాల్లో తమ సిబ్బంది ఇంటింటా పర్యటించి నూరు శాతం కార్యక్రమాన్ని పూర్తి చేశారన్నారు.

వాటర్ ట్యాంకుల పరిశుభ్రత

కపిలేశ్వరపురం : షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను సంబంధిత సిబ్బంది శుభ్రం చేస్తున్నట్టు ఎంపీడీఓ కొండలరావు తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లోని వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకులను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది శుభ్రం చేశారు. ఆయా పనులను ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. వేసవి సమీపించిన నేపథ్యంలో త్రాగునీరు కొరత రానీయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెండు నెలలు పాటు విద్యుత్ కోతలు ఏమైనా ప్రకటితమైతే తాగునీరు సరఫరాకు ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను నింపాలని సూచించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

రాయవరం: పసలపూడిలో బైపాస్ సెంటర్ వద్ద బుధవారం సాయంత్రం శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏటా శ్రీవారి వార్షిక కల్యాణం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నిర్వహించిన కల్యాణ క్రతువులు వాసంశెట్టి సూర్యనారాయణరెడ్డి, సిరివెన్నెల దంపతులు పీటలపై కూర్చుని నిర్వహించారు. పసలపూడి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విశ్వేశ్వరస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన అన్నపూర్ణ విశాలాక్షీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో కొంతేటి బాలసుబ్రహ్మణ్య శర్మ, కొంతేటి విశ్వనాథశర్మ, దేవులపల్లి ఫణిరామకృష్ణల బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలోని ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగే మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ట్రాఫిక్ నిబంధనలను ప్రయాణికులు తప్పక పాటించాలని ఎస్సై జానీ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం డీఎస్పీ నాగిరెడ్డి ఆదేశాల మేరకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రావులపాలెం నుంచి యానం ఏటిగట్టు మీదుగా పోయే వాహనాలు అన్నీ కూళ్ల గ్రామం దుర్గమ్మ గుడి వద్ద నుంచి పామర్రు, కె.గంగవరం వైపుగా వెళ్లాలన్నారు. యానం నుంచి రావులపాలెం ఏటిగట్టు మీదుగా వెళ్లి వాహనాలు కోట గ్రామం నుంచి కె.గంగవరం మీదుగా పామర్రు వైపు వెళ్లాలన్నారు. కాకినాడ నుంచి అమలాపురం వైపుగా గోదావరి పంటి మీద ప్రయాణం చేసే వాహనాలు పాతకోట ఏటిగట్టు నుంచి దంగేరు వైపు యానం నుంచి దారి మళ్లించారన్నారు. అమలాపురం నుంచి కాకినాడ వైపు గోదావరి పంటి మీద ప్రయాణం చేసే వాహనాలు ముక్తేశ్వరం నుంచి యానం వైపుగా దారి మళ్లించామని ఆయన పేర్కొన్నారు.

నక్కా సింహాచలానికి ఘన సత్కారం



వెంటూరులో సింహాచలంను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రాయవరం: మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన వైఎస్సార్ సీపీ నేత నక్కా సింహాచలంను మండలంలోని వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి, చెల్లూరు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు బుధవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నక్కా సింహాచలంను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేసిన విషయం పాఠకులకు విదితమే. నాలుగు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో కోఆర్డినేటర్ సూర్యప్రకాష్
- పాల్గొన్న సమన్వయకర్త శ్రీనివాసరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాష్



లయన్స్ కల్యాణ మండపంలో లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్

కె.గంగవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని సోషల్ మీడియా వ్యక్తులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ సూచించారు. అరిటికాయలలంక గ్రామంలో బుధవారం కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం రూరల్ పట్టణ నియోజకవర్గ స్థాయి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా కోఆర్డినేటర్ సూర్యప్రకాష్, నియోజకవర్గ సమన్వయకర్త శ్రీనివాసరాజు పాల్గొన్నారు. కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ గడచిన నాలుగన్నరేళ్లుగా గ్రామాల్లో జరుగుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని పూర్తి స్థాయిలో ప్రజల్లోని తీసుకువెళ్లాల్సిన బాధ్యత సోషల్ మీడియా కార్యకర్తలపై ఉందన్నారు. ప్రస్తుతం రానున్న ఎన్నికల్లో ప్రత్యర్థులందరూ ఏకమై అధికార పార్టీపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని వారు చేస్తున్న విమర్శలు అదే స్థాయిలో తిప్పికొట్టేలా సోషల్ మీడియా కార్యకర్తలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా జరుగుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేస్తున్న ప్రతి మంచి పనిని గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరికి తెలిసేలా చూడాలన్నారు. సమన్వయకర్త శ్రీనివాసరాజు మాట్లాడుతూ మరో నెలన్నర వ్యవధిలో ఎన్నికలు రాబోతున్నాయని ప్రతి ఒక్క సోషల్ మీడియా కార్యకర్త కొంత సమయం వెచ్చించి పార్టీ విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ పరంగా, వ్యక్తిపరంగా అండగా ఉంటాని ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాని సూచించారు. సర్పంచ్ పిల్లి రాంబాబు, ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, పిల్లి దుర్గాప్రసాద్, కోట సత్తిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి కళ్యాణ్, దొరబాబు సోషల్ మీడియా కన్వీనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..

రామచంద్రపురం: ఐదేళ్ల పాటు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగించిందని, రాబోయే కాలంలో పేదలకు అందుతున్న పథకాలు తిరిగి అమలు కావాలంటే సీఎంగా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని లయన్స్ కల్యాణ మండపంలో బుధవారం ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాలను అమలు చేసి చూపించిందన్నారు. ఏ విధమైన మధ్యవర్తులు లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులందరికీ సొంత ఇంటిని కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీదేనని చెప్పారు. ప్రభుత్వ పాలనను సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే తీసుకువచ్చి, సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్న ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని సూర్యప్రకాష్ అన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అందించని విధంగా అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలను ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇచ్చిందని, అంతేకాకుండా వాటిపై పూర్తి హక్కులను కల్పిస్తూ లబ్ధిదారులైన మహిళల పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నది జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని సూర్యప్రకాష్ స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్లు తోట అమ్మాజీ, కేతా సుజాత, కట్టా శ్రీరాములు, వాడ్రేవు సాయిప్రసాద్, కేతా శ్రీను, నల్లా అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

7వ వార్డులో ఇంటింటా పర్యటన

పట్టణంలోని 7వ వార్డు రైలు గట్టు గణేష్‌నగర్ ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఇంటింటా పర్యటించారు. గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేసిన మంచిని లబ్ధిదారులకు వివరించారు. ఏమైనా సమస్యలున్నాయా అంటూ వారిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే తిరిగి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



ద్రాక్షారామలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుక

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ దక్షగుండం వద్ద వేంచేసిన గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 42వ కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దమరసింగు సత్యవతి ఆధ్వర్యంలో అత్తిలి శివరామకృష్ణ, కొడమంచిలి సత్యనారాయణల బ్రహ్మత్వంలో కల్యాణ క్రతువును కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొసనా భీమశంకరం, విశ్వలక్ష్మి దంపతుల చేతుల మీదుగా వేద మంత్రోచ్ఛారణ నడుమ కనుల పండువగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొసనా కామేశ్వరరావు, ద్రాక్షారామ సంఘం ఉపాధ్యక్షుడు పోలవరపు సుబ్బారావు, కార్యదర్శి టేకి శ్రీనివాసు, కోశాధికారి ధవళేశ్వరపు దుర్గాప్రసాద్, గౌరవాధ్యక్షుడు గారోజు సూరిబాబు, నెల్లూరి సత్యశ్రీనివాసరావు, కాల్దారి వెంకటేశ్వరరావు, భరణికల సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వార్డు సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏడిదలో రథం ఊరేగింపు

కపిలేశ్వరపురం (మండపేట): శివరాత్రి సందర్భంగా మండపేట మండలం ఏడిదలో బుధవారం రథం ఊరేగించారు. గ్రామ వీధుల్లో భక్తులు శివయ్యకు పూజలు చేశారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కురుపూడి రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ చేనేత విభాగం సహాయ కార్యదర్శి బేతా వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

దండుమారెమ్మ జాతర



రాయవరం: వెంటూరులో భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న దండుమారెమ్మ తల్లి అమ్మవారి జాతర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. మారెమ్మ తల్లి అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించి 15వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల విరాళాలతో అమ్మవారికి సమకూర్చిన 23 కేజీల వెండితో తయారు చేసిన చీరను అమ్మవారికి అలంకరించారు. దీని విలువ సుమారు రూ.15లక్షలు ఉంటుందని ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుడు రిమ్మలపూడి వేణుగోపాలదొర తెలిపారు. ప్రధాన దాతలు వెదుళ్ల గణపతిచౌదరి, ప్రసన్నదంపతుల చేతుల మీదుగా అమ్మవారికి చీరను అలంకరింపజేశారు.

కాపులకు సీఎం జగన్ పెద్దపీట

రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే మద్దతు



పట్టణంలో జరిగిన వైఎస్సార్ సీపీ సమావేశంలో కాపు నేతలు

రామచంద్రపురం: అయిదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో నియోజకవర్గంలో కాపులకు అత్యధికంగా సంక్షేమ పథకాలు అందాయని రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో కాపు సామాజికవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాష్‌కు అండగా ఉంటూ అత్యధిక మెజార్టీలో గెలిపిస్తామని నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ కాపు నేతలు అన్నారు. పట్టణంలో వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ పిల్లి సూర్యప్రకాష్‌కి మద్దతుగా పార్టీ నేత, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తొగరు మూర్తి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కాపు నాయకుల సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణం నుంచి కాపు నాయకులు విచ్చేసి వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్‌కు తమ మద్దతును ప్రకటించారు. సమావేశంలో తొగరు మూర్తి మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా పేద కాపు కుటుంబాల్లో వెలుగులు నింపింది సీఎం జగనేనని అన్నారు. అనేక పథకాల ద్వారా పేద కాపులను ఆదుకుంటున్న వైఎస్ జగనన్నకు కృతజ్ఞతగా రాబోయే ఎన్నికలలో సూర్యప్రకాష్‌కి తమ సామాజికవర్గం సంపూర్ణ మద్దతు తెలుపుతూ అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని తొగరు మూర్తి తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లో కాపులకు రాజకీయంగా అనేక పదవులను ఇచ్చారన్నారు. అందుకు తాను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గెలుపొందడమే ఉదాహరణ అన్నారు. కాపు సోదర సోదరీమణులంతా పిల్లి సూర్య ప్రకాష్‌కి మద్దతు ఇవ్వాలని చైర్ పర్సన్ పిలుపునిచ్చారు. సమావేశంలో కాజులూరు మండల నాయకులు వర్రే రాము, సలాది నానాజీ, యాళ్ల సత్తిబాబు, బొండా గంగరాజు, యాళ్ల శ్రీనివాస్, పెమ్మిరెడ్డి వెంకటరమణ, మట్టా ఆదిబాబు, కేశవబాబు, కె.గంగవరం మండల నాయకులు అడపా పెద్దకాపు, యర్రంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భీమక్రోసుపాలెంలో గ్రామ పెద్దలను కలసి మద్దతు కోరుతున్న ఎంపీ బోస్

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

రామచంద్రపురం రూరల్: ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని రాజ్యసబ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని భీమక్రోసుపాలెంలో తన కుమారుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్‌కు మద్దతుగా గ్రామ పెద్దలను, కుల సంఘాల పెద్దలను కలసి మద్దతు కోరారు. ఎన్నికల హామీల్లో అన్నిటిని అమలు చేసిన ప్రభుత్వానికి మళ్లీ ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పలివెల లోవరాజు, ఎంపీటీసీ యెన్నం దేవి, నాయకులు కూనిశెట్టి సూర్యప్రకాశరెడ్డి, అనిశెట్టి వెంకటలోవరెడ్డి, పిల్లి శ్రీనివాసరావు, కుక్కల దొరబాబు, బుంగా రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత నీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు

రామచంద్రపురం రూరల్: రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు సురక్షిత మంచినీరు అందించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు అవసరమైన ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా పంచాయతీ అధికారి రామచంద్రపురం నియోజకవర్గ ప్రత్యేక అధికారి డి.రాంబాబు తెలిపారు. దీనిలో భాగంగా రామచంద్రపురం మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని 43 ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచే కార్యక్రమాలను బుధవారం స్వయంగా పరిశీలించారు. దీని కోసం ప్రత్యేకంగా నియమించబడిన మండల స్థాయి అధికారులను సమన్వయపరుస్తూ వేసవిలో ప్రజలకు ఎటువంటి తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి తప్పనిసరిగా శుభ్రం చేయించాలని సూచించారు. మంచినీటి పైపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏ విధమైన రిపేర్లు ఉన్నా యుద్ధ ప్రాతిపదికన బాగు చేయించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలోని ప్రజలకు క్లోరినేషన్ చేయబడిన స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్.రాహుల్, ఎంఈఓ ఎం.శ్రీనివాస్, ఏఓ ఎన్.సత్యప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం



కాపవరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ సతీష్ అన్నారు. మండలంలోని కాపవరం సచివాలయం వద్ద బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీఓ ఎన్‌వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ సేలెట్ రాజు, కమల్ శేషు, ఈశ్వరమ్మ, శ్రీనివాసరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటి స్థల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

కాజులూరు: గొల్లపాలెం గ్రామ పంచాయతీలో బుధవారం పలువురి లబ్ధిదారులకు అధికారులు, నాయకులు 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ఇంటి స్థల హక్కు పత్రాలు పంపిణీ చేశారు. వీఆర్వో ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.ప్రసన్నమానిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, పాలకవర్గ సభ్యులు ఎ.శ్రీనివాస్‌గౌడ్, పి.శ్రీను, వనమాడి కొండబాబు, పోతురాజు బాబూరావు తదితరులు లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీలో 50 మంది చేరిక



ద్వారపూడిలో వైఎస్సార్ సీపీలో చేరినవారితో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడిలో మంగళవారం రాత్రి 50 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ నాయకులు చిక్కాల శ్రీను నివాసం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చేరిన వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. సంక్షేమ పాలనలో కార్యదీక్షతతో ప్రజల్లో పనిచేయాలని ఎమ్మెల్సీ తోట అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈతకోట కిన్నెర, నాయకులు నక్కా సింహాచలం, పలివెల సుధాకర్, రాంబాబు, ఉప సర్పంచ్ తులా శేషారావు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో సెక్టోరల్ అధికారుల కీలకం

రాయవరం: ఎన్నికల విధుల్లో సెక్టోరల్ అధికారులు, బూత్ లెవల్ అధికారుల పాత్ర కీలకమని మండపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎల్లారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో బుధవారం సెక్టోరల్ అధికారులు, బూత్ లెవల్ అధికారులకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అంశం కీలకమని అన్ని సక్రమంగా నిర్వహించాలని బీఎల్వోలు, సెక్టోరల్ అధికారులకు సూచించారు. సెక్టోరల్ అధికారులు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణమూర్తి, డి.శ్రీనివాస్, చైతన్యకుమారి, కొప్పిశెట్టి ప్రభాకర్, శ్రీనివాసరావు, 53 పోలింగ్ బూత్ అధికారులు పాల్గొన్నారు.

అంగర హైస్కూల్‌లో సోలార్ సిస్టం ప్రారంభం

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు 'మా మహామాయ ఇండస్ట్రీస్' ద్వారా మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అగర్వాల్ రూ.6.50 లక్షలు విలువైన 8కేవీఏ సామర్థ్యం గల సోలార్ సిస్టంను సమకూర్చారు. సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సోలార్ సిస్టంను సమకూర్చినట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పాఠశాలలో అమర్చిన సిస్టంను జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. పాఠశాల కమిటీ చైర్మన్ శలా కోటేశ్వరరావు, హెచ్‌ఎం అంగర రాజు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారారావు, పెద్దిరెడ్డి శేషారత్నం, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలకు సామాజిక బాధ్యతతో సాయమందించిన మా మహామాయ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ అగర్వాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండపేట నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ చల్లా ప్రభాకర్‌రావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయం విజ్ఞాన భాండాగారం

- వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ భవనం ప్రారంభం



గ్రంథాలయ ప్రాధాన్యతపై మాట్లాడుతున్న పట్టాభిరామయ్య చౌదరి

కపిలేశ్వరపురం (మండపేట): విలువైన గ్రంథాలయాలను ఒడిలో అమర్చుకున్న గ్రంథాలయం మానవ జీవితానికి మంచి మార్గాన్ని చూపుతుందని ప్రముఖ పారిశ్రామికవేత్త వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి అన్నారు. మండపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త, మాధవీ ఎడిబుల్ ఆయిల్స్ అధినేత వేగుళ్ల చైతన్యబాబు రూ.30లక్షలు సమకూర్చారు. వేగుళ్ల సూర్యారావు గ్రంథాలయం పేరుతో నిర్మితమైన భవనాన్ని బుధవారం వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు. దాత చైతన్యబాబు ఔదార్యాన్ని ప్రశంసిస్తూ ఆయన కుటుంబ సభ్యులను కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. విద్యార్థుల విజ్ఞాన సముపార్జనకు దాత చైతన్యబాబు చేసిన సాయం సమాజంలో మెరుగైన మార్పునకు దోహదపడుతుందని వారన్నారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయంలో కళాశాలలోని అన్ని కోర్సులకు చెందిన పుస్తకాలను అందుబాటులోకి తెచ్చి విద్యార్థులకు ప్రగతికి తోడ్పాటునిస్తామన్నారు.

'పద్మశాలి' సామాజిక వర్గం అభివృద్ధికి కృషి



అంగరలో పద్మశాలి సామాజిక భవనం ప్రారంభ కార్యక్రమంలో ఎంపీ అనురాధ

కపిలేశ్వరపురం: పద్మశాలీ సామాజిక వర్గీయుల అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ అన్నారు. అంగరలో రూ.10 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులతో నిర్మించిన పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఆమెకు వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గం పరిశీలకులు డాక్టర్ చల్లా ప్రభాకరరావు, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, నక్కా సింహాచలం, పద్మశాలీ సంక్షేమ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. సంఘం నాయకులు బండారు మహాలక్ష్మేశ్వరరావు, చీపూరి వీరబాబు, కట్టా శ్రీనివాసరావు, మహిళలు ఎంపీ అనురాధను సత్కరించారు. వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ భవనంలోని పలు విభాగాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు, మామిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో చిన్నారులకు బంగారు పతకాలు



ద్వారపూడికి చెందిన చిన్నారులు

కపిలేశ్వరపురం (మండపేట): ఈ నెల 3వ తేదీన తెలంగాణ మంచిర్యాల జిల్లా మందమర్రిలో కియో జపాన్ చోటాఖాన్ కరాటే సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండపేట మండలం ద్వారపూడి వారియర్ మ్యాన్స్ కుంగ్ పూ సంస్థ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చారు. సంస్థ మాస్టర్ మురళి, కోచ్ కె.సత్తిబాబు బుధవారం మాట్లాడుతూ జూనియర్ ఏ విభాగంలో ఎం.తేజ, జి.శంకర్, కె.శ్రావణ్ కుమార్, డి.గోవిందరాజ్ బంగారు పతకాలు సాధించారన్నారు. బాలికల జూనియర్స్ విభాగంలో వి.హేమలత, సీనియర్స్ విభాగంలో వి.పావనిదుర్గ, బాలుర సీనియర్స్ విభాగంలో బి.సూర్య, బి.అఖిల్, ఐ.సాయిసంతోష్, బి.సంతోష్ కిరణ్ బంగారు పతకాలు సాధించారన్నారు. జాతీయస్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీల్లో కటాస్ విభాగాల్లో పతకాలు సాధించడంపై క్రీడాకారులను ద్వారపూడికి చెందిన ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, వారియర్ మ్యాన్స్ కుంగ్ ఫూ సంస్థ వ్యవస్థాపకులు వెంకట రెడ్డి, అధ్యక్షుడు మురళి, కోచ్ కె.సత్తిబాబు, కన్వీనర్ నామాల శ్రీనివాసరావు అభినందించారు.